క్లుప్తంగా

విద్యార్థుల ప్రగతి ఆధారంగా బోధన చేయాలి



బీకేపాలెం(కాకుమాను): విద్యార్థుల ప్రగతి ఆధారంగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని బీకేపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఎంఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి ఆధారంగా ఏ, బీ, సీ, డీలుగా విభజించి తరగతిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. సీ, డీ గ్రూపులలో ఉన్న వారికి ప్రతి రోజు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఏ గ్రూపులోకి వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన తెలిపారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

పట్నంబజారు: కారు ఢీకొని వాహనచోదకుడు గాయపడిన ఘటనపై కేసు నమోదు అయింది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 8న రాత్రి చంద్రయ్యనగర్‌కు చెందిన దారా సలీమ్‌రాజ్, స్నేహితుడు పి.కిరీటి అరండల్‌పేట 1వ లైనులో రైల్వే క్యాంటీన్ వద్దకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. అదే సమయంలో గుర్తు తెలియని కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. సలీమ్‌రాజ్ కాలు విరిగింది. స్నేహితుడు కిరీటికి స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సదరు కారు యజమాని ఒక ప్రముఖ వైద్యుడు కావడంతో రాత్రి వదిలి వేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పోలీసులను వివరణ కోరగా వాహనం వివరాలు తెలియలేదని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ ఘటనా స్థలానికి వెళ్లి విచారించి వచ్చారు. వాహన వివరాలు తెలియదనడంలో పోలీసులు గోప్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

15న విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీశారదా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఈనెల 15న పాఠశాల స్థాయి విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరిప్రసాద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1- 5 తరగతి వరకు జూనియర్స్, 6-10 తరగతి వరకు సీనియర్స్‌గా విభజించామని అన్నారు. భగవద్గీత 15వ అధ్యాయం పూర్తిగా(పురుషోత్తమ ప్రాప్తియోగం), సుమతి శతకం ఒకటి నుంచి పది వరకు పద్యాలు, చిత్రలేఖనం(శ్రీరాముని చిత్రం), భక్తి గీతాల(ఒక పాట) పోటీలు ఉంటాయని తెలిపారు. చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనే వారికి చార్టు ఉచితంగా అందిస్తామన్నారు. వివరాలకు 8977585444, 08632356444 సంప్రదించాలని చెప్పారు.

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు స్థాపించుకునే హక్కును సాధించి పెట్టిన మహనీయుడు చెన్నుపాటి లక్ష్మయ్య అని యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ ఉద్యమనేత చెన్నుపాటి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమం కోసం చెన్నుపాటి తన జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. సంఘాన్ని స్థాపించడమే కాకుండా రాష్ట్రం మొత్తం తిరిగి ఉపాధ్యాయులను ఏకం చేస్తూ సంఘం బలోపేతానికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ చెన్నుపాటి ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనలో చెన్నుపాటి స్ఫూర్తితో రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు. జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం.గోవిందు, కె.రంగారావు, బెల్లంకొండ ప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, సీనియర్ కార్యకర్తలు ఆదామ్ సాహెబ్, కొండపల్లి వెంకటేశ్వరరావు, భాస్కర్, పి.శ్రీనివాసరావు, కిషోర్ పాల్గొన్నారు.

సైపుల్లా జన్మదిన వేడుకలు



పొన్నూరు: వైఎస్సార్‌సీపీ యువ నాయకులు, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా జన్మదిన వేడుకలు సోమవారం పొన్నూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎంఎం యూత్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సైపుల్లా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎంపీ మహమూద్, అంజుమన్ కమిటీ అధ్యక్షులు షేక్ మహమ్మద్, నాయకులు ఆకుల రామ్మోహన్, మొల్లా నసీరుద్దీన్, జమాల్‌ఖాన్, పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

మూతబడుతున్న పాఠశాలలు

సర్కారు బడుల పరిస్థితి నానాటికీ దయనీయంగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య వందల సంఖ్యలో తగ్గిపోతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్య.. విద్యా కానుక కిట్లు.. అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందించడం.. మన బడి నాడు-నేడు ద్వారా మౌలిక వసతుల కల్పన.. ఇలా పలు సంస్కరణలు చేపట్టడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు మాత్రం శూన్యం.



గోళ్ళమూడి గ్రామంలో మూతపడ్డ ప్రాథమిక పాఠశాల

- చతికిల పడుతున్న సర్కారు చదువులు
- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిపోతున్న విద్యార్థులు
- ప్రభుత్వ చర్యలు శూన్యం



పెదకాకాని జెడ్పీహెచ్ స్కూల్‌లో నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం

పెదకాకాని: ప్రభుత్వ పాఠశాలల ద్వారా ఉచితంగా చదువులు చెప్పడమే కాకుండా వారికి పుస్తకాలు, యూనిఫాం ఇచ్చినా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతూనే ఉంది. పెదకాకాని మండలంలో మొత్తం 47 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 7 జిల్లా పరిషత్ పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, 37 ప్రాథమిక, ఎయిడెడ్, ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. మండలంలో ఉన్న 47 పాఠశాలల్లో గత ఏడాది విద్యా శాఖ లెక్కల ప్రకారం 5,123 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తే ఈ ఏడాది 4,764 మంది చదువుకుంటున్నారు. ఒక్క సంవత్సరంలోనే 359 మంది విద్యార్థులు తగ్గిపోయారు.

20 మంది పిల్లలు కూడా లేని పాఠశాలలు 10

పెదకాకాని మండలంలోని ఈ ఏడాది ప్రారంభం నుంచే గోళ్ళమూడి ప్రాథమిక పాఠశాల మూత పడింది. అదే దారిలో మరొక పాఠశాల సిద్ధంగా ఉంది.

- వెంకటకృష్ణాపురంలోని యాదవపాలెం ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు, ఒక టీచరు ఉన్నారు.
- దేవరాయబొట్లవారిపాలెం పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు.
- నంబూరు శివారులోని ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు.
- ఉప్పలపాడు రాజీవ్ సెంటర్‌లో ఏడుగురు విద్యార్థులు, ఒక టీచరు. పెదకాకాని హెచ్‌టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 15 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు.

మండలంలోని 37 ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది పిల్లలు కూడా లేని పాఠశాలలు 10 ఉన్నాయంటే పిల్లల హాజరు శాతం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు శూన్యం. ఇదీ పెదకాకాని మండలంలోని ప్రాథమిక పాఠశాలల దయనీయ పరిస్థితి.

గత ప్రభుత్వంలో పెరిగిన విద్యార్థుల సంఖ్య

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టడంతో పాటు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. అలాగే అమ్మ ఒడి పథకం ద్వారా ప్రతి తల్లి బ్యాంకు ఖాతాలో సంవత్సరానికి రూ.15 వేలు జమ చేయడం, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలు అమలు చేసి విద్యార్థులను అన్ని విధాలా ప్రోత్సహించి అక్షరాస్యత శాతం పెంచేందుకు కృషి చేశారు. అంతే కాకుండా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలనే ఆశయంతో మన బడి నాడు-నేడు పథకం ద్వారా కోట్ల రూపాయలు ఖర్చు చేసి పాఠశాలలను అభివృద్ధి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాలల్లో జరుగుతున్న పనులు ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేకంగా ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణ దశలో నిలిచిపోయిన పాఠశాల గదుల నిర్మాణం పూర్తి చేయాలని, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పాఠశాలలు మూతపడకుండా చూడాలని తల్లిదండ్రులు, విద్యావంతులు, గ్రామ పెద్దలు కోరుతున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



పొన్నూరు: మండలంలోని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు విక్రయించాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. సోమవారం మండల పరిధి కట్టెంపూడిలోని కుమార్ రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఇప్పటి వరకు మిల్లులో జరిగిన ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లను ముమ్మరం చేయాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. రైతులు తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని, ప్రతి రైతు వద్ద కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ధాన్యం కొనుగోలును త్వరితగతిన చేయాలని అన్నారు. మండలంలో ఎవరైనా రైతులను మభ్యపెట్టి మధ్యవర్తుల ద్వారా అక్రమంగా ధాన్యం కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎస్‌డీటీ వెంకట్రావు, ఎంఏటీ దేగల వెంకట్రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిని అరికట్టేందుకు కృషి చేయాలి

లక్ష్మీపురం: పాలనలో అవినీతిని అరికట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో ఓ పెద్ద సవాల్ అయినా పాలకులకు చిత్తశుద్ధి ఉంటే అవినీతిని 90 శాతం వరకు అరికట్టవచ్చని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో అవినీతిపై సోమవారం చర్చ కార్యక్రమం నిర్వహించారు.

సౌత్ జోన్ కబడ్డీ టీంకు విజ్ఞాన్ నిరుల విద్యార్థిని



శ్రీలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పీ రాధిక తదితరులు

గుంటూరు రూరల్: తమ కళాశాలలో బీటెక్ విద్యను అభ్యసిస్తున్న ఐనవోలు శ్రీలక్ష్మి జేఎన్‌టీయూ కాకినాడ తరఫున సౌత్ జోన్ కబడ్డీ టీంకు ఎంపికవ్వటం సంతోషంగా ఉందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ రాధిక తెలిపారు. సోమవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థిని అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలలో రాణించటం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ఎంపికైన శ్రీలక్ష్మిని విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షులు లావు శ్రీకృష్ణదేవరాయలు, కళాశాల ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి.సంధ్య, ఫిజికల్ డైరెక్టర్ కిషోర్‌కుమార్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ హరీష్ తదితరులు అభినందించారు.

విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నంబూరు వీవీఐటీలో సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న మంగళగిరి డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ

పెదకాకాని: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం పెదకాకాని పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంగళగిరి డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు ఇతరులను కూడా అప్రమత్తం చేయాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి సోషల్ మీడియా ఖాతాలకు వచ్చే నోటిఫికేషన్, రిక్వెస్ట్‌లను అనుమతించవద్దన్నారు. ముఖ్యంగా నగదు ఆశ చూపించి ఓటీపీ నంబర్ అడిగే వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ చెప్పవద్దని సూచించారు. పెదకాకాని సర్కిల్ ఇన్స్పెక్టర్ నారాయణస్వామి మాట్లడుతూ విద్యార్థులు లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. సమాజంలో లోన్‌యాప్ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. మీ పేరిట పార్సిల్ వచ్చిందంటూ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సాంకేతికతను వినియోగించి సైబర్ నేరాల నియంత్రణకు విద్యార్థులు యాప్‌లను రూపొందించాలన్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదులకు 1930 నంబరుకు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు జాతీయ సేవా పథకంలో భాగంగా సోమవారం ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని దానికి ప్రత్యామ్నాయంగా గోనె సంచులను ప్రకృతి సిద్ధంగా తయారయ్యే ఇతర వనరులను వినియోగించి పర్యావరణానికి మేలు చేయాలని సూచించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్లకార్డులతో వివరించారు. అనంతరం గ్రామంలోని వీధులు, పాఠశాలల వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రపరిచారు. వంగ నవీన్‌రెడ్డి, డాక్టర్ ఏజే సువర్ణలత, డాక్టర్ ఎం.రమాదేవి, నామ శ్రీనివాస్, విద్యార్థినులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పట్నంబజారు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్ఐ రమేష్ చెప్పారు. సైబర్ క్రైమ్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఏసీ కళాశాల, మహిళా కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలకు సంబంధించి పోస్టర్లు ఆవిష్కరించారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలకు సంబంధించి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వారిని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వేధింపులకు గురిచేసే అవకాశం ఉందన్నారు. అలాంటి ఘటనలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. సైబర్ క్రైమ్‌కు సంబంధించి షార్ట్‌ఫిల్మ్ నిర్వహిస్తున్న సమయంలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఇంటర్మీడియెట్ నుంచి పీజీ చదివే విద్యార్థులు అర్హులని, 16 నుంచి 22 సంవత్సరాల్లోపు వయస్సు వారు అయి ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ గురించి షార్ట్‌ఫిల్మ్ వీడియో నిడివి ఐదు నుంచి ఎనిమిది నిమిషాలు ఉండాలని కోరారు. ఆరు నుంచి ఏడుగురు పాత్రధారులు ఉండవచ్చన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు, కన్సోలేషన్ ప్రైజ్ రూ.5 వేలు ఉందని ఆయన వెల్లడించారు.

ఇక్కడ రెండు.. అక్కడ మూడు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరువు



సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను స్వీకరించిన కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు : పొన్నూరులోని మున్సిపాలిటీ, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరువయింది. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అర్జీలను స్వీకరించి సంబంధిత విభాగాలను వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అయితే ఉదయం 10 గంటల నుంచి మధ్యాన్నం 2 గంటల వరకు నిర్వహించిన గ్రీవెన్స్‌లో మున్సిపాలిటీ పరిధిలో 2, మండల పరిధిలో 3 దరఖాస్తులు వచ్చాయి. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులందరూ వేదికలో పాల్గొంటున్నా ప్రజల నుంచి స్పందన మాత్రం కనిపించడం లేదు. అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, గ్రీవెన్స్‌లో సమస్యను చెప్పుకునేందుకు రావడం లేదు. పట్టణ, మండల పరిధిలో వీధిలైట్లు, భూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, పారిశుద్ధ్యం వంటి అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఆ సమస్యలను సంబంధిత అధికారులకు చెప్పుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై సరైన ప్రచారం లేకపోవడమే అర్జీలు తక్కువ సంఖ్యలో రావడానికి ప్రధాన కారణంగా మారింది. ఇకనైనా ప్రతి సోమవారం నిర్వహించే సమస్యల పరిష్కార వేదికపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



నగర ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 22 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని కోరారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజల నుంచి 47 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 20, ఇంజినీరింగ్ విభాగానికి 15, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 5, అకౌంట్స్ విభాగానికి 3 ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, సిటీ ప్లానర్ రాంబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం





తక్కెళ్ళపాడులో విద్యుత్ షార్ట్ షర్క్యూట్ కారణంగా కాలిపోయిన గృహోపకరణాలు

పెదకాకాని: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు కాలిపోయిన ఘటన తక్కెళ్ళపాడులో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన కోటేశ్వరరావు గత కొంతకాలంగా ఇల్లు అద్దెకు ఇచ్చాడు. ప్రస్తుతం ఆ ఇంటిలో వెంకట్రావు అతని అనుచరులు నివసిస్తున్నారు. వారు గృహోపకరణాలు వాయిదా పద్ధతిలో గ్రామాల వెంట తిరిగి బాకీ ఇవ్వడం, తిరిగి వసూలు చేసుకోవడం వంటి వ్యాపారం చేస్తున్నారు. సోమవారం కూడా సమీప గ్రామాలకు వ్యాపారం నిమిత్తం వెళ్లారు. ఇంటి నుంచి పొగలు దట్టంగా రావడంతో స్థానికులు తాళాలు పగులగొట్టి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆ ఇంటిలో ఉన్న ఫ్యాన్‌లు, మిక్సీలు, గ్యాస్ పొయ్యిలు, స్పీకర్ బాక్సులు, గ్రైండర్‌లు, వంటి సామగ్రి పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే సామానులు అన్నీ కాలిపోయాయి. వెంకట్రావు ఇంటికి చేరుకుని చూడగా వ్యాపారానికి తెచ్చుకున్న పరికరాలు కాలిపోయి ఉన్నాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక శాఖ వారికి వెంకట్రావు వివరించాడు. కాలిపోయిన వస్తువుల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలియజేశాడు.

బీజేపీ సంస్థాగత బూత్ స్థాయి అధ్యక్షుల ఎన్నిక

గుంటూరు మెడికల్: బీజేపీ సంస్థాగతంగా పోలింగ్ బూత్ అధ్యక్షుల ఎన్నిక మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఈదర శ్రీనివాసరెడ్డి సమక్షంలో సోమవారం ఏటీ అగ్రహారంలో నిర్వహించారు. మండలంలో 186 నుంచి 197 బూత్ వరకు పోలింగ్ బూత్ అధ్యక్షులు ఎన్నిక అయ్యారు. వారికి రిటర్నింగ్ అధికారి ఎన్నిక నియామక పత్రాలని అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీజేపీ పదాధికారి కొక్కెర శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఎన్నికైన బూత్ అధ్యక్షులని పూలలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ ప్రతాప ప్రసాద్, మండల అధ్యక్షుడు లంకా రవి శంకర్, రాష్ట్ర పూర్వ మజ్దూర్ సెల్ కార్యదర్శి తిరుమలశెట్టి వెంకట రమణ నాయుడు, తడువాయి రామకృష్ణ, మండల సహా రిటర్నింగ్ అధికారి సాయి, మధు, బాదం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కసుకర్రులో రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న చెట్లు

ఓ ప్రమాదకరమైన మలుపు..!

పొన్నూరు: మండలంలోని కసుకర్రు గ్రామంలో ఓ మలుపు ప్రమాదకరంగా మారింది. చెట్లు పెరిగి రోడ్డుపై విస్తరించడంతో వాహనాలు దగ్గరికి వచ్చే వరకు తెలియకపోవడంతో ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గ్రామ ప్రధాన రహదారిలో సమస్య జటిలంగా మారినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. వెంటనే చెట్లు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రతిభావంతమైనది శతక సాహిత్యం



నగరంపాలెం: తెలుగు సాహిత్యంలో శతక పద్యం ఎంతో ప్రాశస్త్యాన్ని పొందిందని హిందూ కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు, ఆచార్యులు యల్లాప్రగడ మల్లికార్జునరావు అన్నారు. గుంటూరు పుస్తక మహోత్సవ వేదికపై అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విద్యార్థులకు శతక పద్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతక సాహిత్య ప్రక్రియ శతాబ్దాల తరబడి మన సాహిత్యంలో ప్రత్యేకతను కలిగి ఉందని అన్నారు. శతక పద్యం సందేశాత్మకంగా ఉంటూ, పాఠకులకు సులువుగా అర్థమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు పండితులు కొణతం నాగేశ్వరరావు, అరసం జిల్లా కార్యదర్శి బుల్లా రవి, ప్రముఖ కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ పాల్గొన్నారు.